

# ఇద్దరు అంతరాష్ట్ర దొంగలు అరెస్ట్



## 11 తులాల బంగారు, బైక్ స్వాదీనం
## రాజంపేట ఏఎస్పీ రామ్నాథ్ హెగ్డే

సిద్దవటం జూన్ 17 (మనం న్యూస్ )
ఇద్దరు అంతరాష్ట్ర చైన్ స్నాచింగ్ దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 11 తులాల బంగారు స్వాదీనం చేసుకున్నట్లు రాజంపేట ఏఎస్పీ రామ్నాథ్ హెగ్డే తెలిపారు. సిద్దవటం పోలీస్ స్టేషన్లో బుధవారం రాజంపేట ఏఎస్పీ విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ భాకరాపేట వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో అనుమానాస్పదంగా ఉన్న ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారు తప్పించుకునేందుకు ప్రయత్నిం చగా వారిని ఎస్సై హారిక, హెడ్ కానిస్టేబుల్ అంజీ నాయక్, హోం గార్డు ప్రదీప్ కుమార్ లు వెంబడించి వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో వారు ప్రతిఘటించారన్నారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్, హోం గార్డు లకు స్వల్ప గాయాలయ్యాయ న్నారు. వీరిని అదుపులోకి విచారించగా సిద్దవటం క్రైం నెంబర్ 53/2025, ఒంటిమిట్ట క్రైం నెంబర్ 65/2025, 136/2025, చిత్తూరు జిల్లా బంగారుపాలెం క్రైం నెంబర్ 66/2026, తిరుపతి జిల్లా భాకరపేట క్రైం నెంబర్ 10/2026, తమిళనాడు రాష్ట్రంలోని మహాలింగాపురంలో క్రైం నెంబర్ 86/2026, తమిళనాడు రాష్ట్రంలోని కరూర్ పోలీస్ స్టేషన్ లలో క్రైం నెంబర్ 289/2026 కేసులతో పాటుగా గతంలో 15 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు అంగీకరించారన్నారు. నిందితులు వారి వద్ద నుంచి 11తులాల బంగారు, ఏపీ40 జేఈ 6759 నెంబరు గల కేటీఎం ద్విచక్ర వాహనం, 2 వేలు నగదును స్వాదీనం చేసుకున్నామన్నారు. నిందితులు ప్రధానంగా వృద్ధ మహిళలు, ఒంటరిగా ప్రయాణించే మహిళను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్ లు, దొంగతనాలు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అద్దెకు తీసుకున్న మోటర్ సైకిళ్లను ఉపయోగించడం, నకిలీ నెంబర్ ప్లేట్లు అమర్చడం, హెల్మెట్లు, మాస్కులు ధరించి పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినట్లు తెలిసిందన్నారు. తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి కి చెందిన వెంకటేష్ బాలమురుగన్, తమిళనాడు రాష్ట్రం రామనాథపురం జిల్లా కు చెందిన ముత్తుపాండి ముత్తు రామలింగం అనే నిందితులను కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, కడప సీసీఎస్ సీఐ హాజీ వలి, సిద్దవటం ఎస్సై హారిక, ఒంటిమిట్ట ఎస్సై శ్రీనివాసులు, సిద్దవటం ఏఎస్ఐ సుబ్బరామ చంద్ర, సిద్దవటం, ఒంటిమిట్ట, సీసీఎస్ పోలీసులు పాల్గొన్నారు.

# ఆర్ సి ఎల్ 2 లీగ్ క్రికెట్ టోర్నమెంటులో విజేతగా నిలిచిన గిరి లెవన్స్ జట్టు



రైల్వే కోడూరు, జూన్ 17, మనం న్యూస్
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండల పరిధిలోని రాఘవ రాజా పురం గ్రామపంచాయతీలో గత నెల రోజులుగా జరుగుతున్న ఆర్ సి ఎల్ లీగ్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ లో బుధవారం జరిగిన బాబు లేవన్స్ మరియు గిరి 11 జట్ల మధ్య జరిగిన హోరాహోరీ ఫైనల్ లో గిరి 11 జట్టు విజయకేతనం ఎగరవేసింది. ఈ ఫైనల్ మ్యాచ్లో ఆఖరి వరకు ఉత్కంఠగా జరిగిన క్రమంలో మ్యాచ్ టై అవడంతో సూపర్ ఓవర్ నిర్వహించి అందులో గిరి 11 జట్టు విజయకేతనం ఎగరవేసింది. ఈ టోర్నమెంట్ సజావుగా సాగడానికి ఆర్థికంగా సహాయ సహకారాలు అందించిన రామిరెడ్డి ధ్వజారెడ్డి కి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఫైనల్ మ్యాచ్ కు ముఖ్యఅతిథిగా రైల్వే కోడూరు వైస్ ఎంపీపీ, వైసిపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి ధ్వజారెడ్డి విచ్చేసి ఇరుజోట్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గెలుపొందిన జట్టుకు క్యాష్ ప్రైస్ 60 వేల రూపాయలు మరియు ట్రోఫీని కెప్టెన్ గిరి కి అందజేయడం జరిగింది. రన్నరపు జట్టుకు 40 వేల రూపాయలు నగదు బహుమతి మరియు ట్రోఫీని కెప్టెన్ బాబుకు అందజేశారు. అనంతరం రామిరెడ్డి ధ్వజారెడ్డి మాట్లాడుతూ ఈ క్రీడలు యువతకు ఎంతో ఉల్లాసాన్నిస్తాయని అంతేకాకుండా రాజకీయాలకు అతీతంగా క్రీడలు ఉపయోగకరంగా మారతాయని, యువత మధ్య ఉన్నటువంటి అపోహలు తొలగిపోయి క్రీడా స్ఫూర్తితో భవిష్యత్తులో ముందుకు వెళ్ళడానికి ఇటువంటి క్రీడలు దోహదపడతాయని తెలియజేస్తూ , ఈ టోర్నమెంట్లో పాల్గొన్న 35 జట్లకు ఫైనల్ మ్యాచ్ కు విచ్చేసిన ఇరుజట్లకు అభినందనలు తెలియజేస్తూ గెలుపొందిన గిరి 11 జట్టు మరియు రన్నరప్ గా నిలిచిన బాబు జట్లకు ప్రత్యేక శుభాభినందనలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో రాఘవ రాజాపురం మాజీ సర్పంచ్ లు ఆర్ వి రమణ, గోపి, సుబ్రహ్మణ్యం రాజు వైసీపీ సీనియర్ నాయకులు కొలూరి సిద్దయ్య, బాబు రెడ్డి, ఎంపీటీసీలు నూక మహేశ్వర్ రెడ్డి మరియు వైసీపీ నాయకులు కృష్ణారెడ్డి, కంభం శ్రీనివాసులురెడ్డి, షఫీ, ప్రసాద్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రతాప్ రెడ్డి, బత్తిన సుబ్రహ్మణ్యం, హరి, రమణారెడ్డి లతోపాటు గ్రామస్తులు ,క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి : హెచ్ ఎం లేబాక గోపాలకృష్ణ



పెనగలూరు(జూన్ 17),మనంన్యూస్:నూతన విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరడానికి పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నట్లు పెనగలూరు మండలం చక్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లేబాక గోపాల కృష్ణ తెలిపారు. బుధవారం తమ పిల్లలను ఉత్సాహంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ బడుల్లో చేరిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు వుంటుందని వెంటనే పిల్లలను చేర్పించాలని అయన కోరారు. పాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ మౌళిక సదుపాయాలు కల్పించామని, ప్రభుత్వ పథకాలు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా రుచికరమైన ఆహారం విద్యార్థులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అపార అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన డిజిటల్ బోధన, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆరోగ్య సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ఉచిత బస్సు పాసులు అనేక రకాల ప్రోత్సాహకాలు ప్రభుత్వం సమకూర్చడం జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరి ప్రసాద్, అన్వర్ బాష, షబానా, వెంకట రెడ్డి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పుల్లంపేటలో నూతన సర్కిల్ పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎస్పీ సుబ్బరాయుడు

పుల్లంపేట జూన్ 17 మనంన్యూస్. రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని పుల్లంపేట పోలీస్ స్టేషన్లో నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు బుధవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ, రైల్వే కోడూరు నియోజకవర్గ పరిధిలోని పుల్లంపేట, చిట్వేలు, ఓబులవారిపల్లి, పెనగలూరు మండలాల ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పుల్లంపేటలో సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఈ నాలుగు మండలాల ప్రజలు పోలీసు శాఖకు సంబంధించిన వివిధ అవసరాల కోసం రైల్వే కోడూరుకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అన్ని మండలాలకు అనుకూలమైన కేంద్ర ప్రాంతంగా ఉన్న పుల్లంపేటలో నూతన సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించామని చెప్పారు. ఈకార్యాలయం ద్వారా ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన పోలీసు సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. నూతన సీఐ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యమానికి అదనపు ఎస్పీలు, ఆర్ల శ్రీనివాసులు, రవి మనోహరాచారి, రేణిగుంట డిఎస్పీ శ్రీనివాసరావు,రైల్వే కోడూరు పట్టణ సీఐ చంద్రశేఖర్, పుల్లంపేట రూరల్ సీఐ శ్రీనివాసులు ఎస్సై ప్రసాద్ రెడ్డి,పుల్లంపేట రూరల్ సర్కిల్ లోని ఎస్సైలు చిన్న రెడ్డెప్ప, ఓబుళవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్, చిట్వేల్ ఎస్సై వినోద్ కుమార్, పెనగలూరు ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, నాలుగు పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.


## ఆటోను ఢీ కొన్న లారీ

### ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి- ప్రయాణికురాలుకి గాయాలు



ఒంటిమిట్ట మనంన్యూస్. కడప–చెన్నై జాతీయ రహదారి ఒంటిమిట్ట రైల్వే స్టేషన్ కి వెళ్ళు దారి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందగా,మహిళకు గాయాలు అయ్యాయి.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఒంటిమిట్ట దిగువ వీధికి చెందిన మహమ్మద్ రఫీ (51) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రోజు వారి దిన చర్య లో భాగంగా మహమ్మద్ రఫీ ఆటో ఒంటిమిట్ట నుండి బాకరాపేట కు బయలుదేరింది.ఒంటిమిట్ట బ్రిడ్జి దాటగానే కడప నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వస్తూ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మహమ్మద్ రఫీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మాధవరం కు చెందిన రేణుకకు పెదాలు, దంతాలు, చెవి గాయపడి తీవ్ర రక్తస్రావం జరిగింది.అక్కడున్న స్థానికులు వెంటనే 108 కి సమాచారం ఇచ్చారు.108 సిబ్బంది నాగబాబు,పైలట్ బాస్కర్ లు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని, అంబులెన్స్లో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్కు తరలించారు. మహమ్మద్ రఫీకి భార్య ఆశ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు


## తాసిల్దార్ నరసింహారావును మర్యాదపూర్వకంగా కలిసిన నీటి సంఘం అధ్యక్షులు బుర్రు సుబ్రహ్మణ్యం యాదవ్



చిట్వేలి జూన్ 17 మనం న్యూస్ ప్రతినిధి: మండల పరిధిలోని నేతివారిపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, గొట్టి మానుకోన నీటి సంఘం అధ్యక్షులు బుర్రు సుబ్రహ్మణ్యం యాదవ్ బుధవారం నూతనంగా విచ్చేసిన చిట్వేలి మండల తాసిల్దార్ నరసింహారావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి స్వీట్స్ అందజేశారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల పైన చర్చించుకున్నట్లు సుబ్రహ్మణ్యం యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండుపోయిన చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### – ఎంపీడివో విజయారావు



పెనగలూరు(జూన్17),మనం న్యూస్: స్వర్ణ గ్రామాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడివో విజయారావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నారాయణ నెల్లూరు, పెనగలూరు స్వర్ణ గ్రామ కార్యాలయాలను అయన తనిఖీ చేసారు. యోగంద్ర, అక్షరాంద్ర సర్వే ఆన్లైన్ నమోదు ను పరిశీలించారు. బయోమెట్రిక్ సమయపాలన ను తనిఖీ చేసారు. బీ ఎల్ వోలకు ఎస్ఐఆర్ పత్రాలను అందించారు.



## కొత్త పోల్స్ వేస్తున్న తరుణంలో పైప్ లైన్ డామేజ్

### త్రాగునీటికి అంతరాయం

### చిట్వేలీ గ్రామ పంచాయతీ ప్రజలు సహకరించాలని కోరిన ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి



చిట్వేలి జూన్ 17 మనం న్యూస్ ప్రతినిధి: చిట్వేలి స్థానిక బ్రాహ్మణ వీధి బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ నందు సెంట్రల్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ బేసిక్ విద్యుత్ శాఖ సిబ్బంది కొత్త పోల్స్ వేస్తున్న సందర్భంలో ప్రమాదవశాత్తు పైప్ లైన్ పగిలిపోవడం జరిగిందనీ చిట్వేల్ ఉప సర్పంచ్ ఉమా మహేశ్వర్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది పేర్కొన్నారు. పైప్ లైన్ మరమ్మత్తుల పని ఉన్న కారణంగా గురువారం మధ్యాహ్నం వరకు త్రాగునీరు వదలడానికి అంతరాయం కలుగుతుందని ఉమా మహేశ్వర్ రెడ్డి, సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా చిట్వేలీ గ్రామ పంచాయతీకి చెందిన ప్రజలు సహకరించాలని చిట్వేలీ ఉప సర్పంచ్ ఉమా మహేశ్వర్ రెడ్డి కోరారు. పైపులైన్ పగిలిపోవడం వల్ల త్రాగునీటి అసౌకర్యానికి చింతిస్తున్నామని పంచాయతీ అభివృద్ధి అధికారి తెలిపారు.

## నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కస్తూరి



చిట్వేలి జూన్ 17 మనం న్యూస్ ప్రతినిధి: మండల కేంద్రంలోని మల్లెంపల్లి గ్రామానికి చెందిన కస్తూరి నాగభూషణం ఆహ్వానం మేరకు బుధవారం రైల్వేకోడూరు పట్టణంలోని రాఘవరాజపురం గ్రామం నందు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కస్తూరి విశ్వనాథ నాయుడు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కట్టా లోకేష్, ఓబులవారిపల్లి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి చప్పిడి రమేష్ బాబు, యువ నాయకులు కస్తూరి శివ, ఈశ్వరయ్య, నారాయణ తదితర నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమంలో పాల్గొని దిశా నిర్దేశం చేసిన జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు



రైల్వే కోడూరు, జూన్ 17, మనం న్యూస్
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండల పరిధిలో గత రెండు రోజులుగా స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఆర్ .గోవిందరావు తనిఖీ చేయడం జరిగింది. ఈ సర్ కార్యక్రమంలో భాగంగా కోడూరు పట్టణం నందు రెండు పోలింగ్ కేంద్రంలో డోర్ టు డోర్ వెరిఫై చేసి పోలింగ్ కేంద్రం 78, 80 మరియు రాఘవ రాజాపురం నందు రెండు పోలింగ్ కేంద్రంలో 53, 54 లలో బిఎల్ఓ లకు దిశా,నిర్దేశం చేసి తగు సూచనలు జారీ చేయడమైనదని ఆర్. గోవిందరావు తెలిపారు. అంతేకాకుండా రాఘవ రాజాపురం నందు రి సర్వే 5వ ఫేస్ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైల్వేకోడూరు మండల తహసిల్దార్ కే అమర్నాథ్ మరియు రెవిన్యూ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# చిన్నారి అభిమాని చిరుకోరిక తీర్చిన ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ ను పరామర్శించిన పవన్ కళ్యాణ్**

**జన్యుపరమైన అనారోగ్యంతో పోరాడుతున్న హనుమకొండకు చెందిన నిరంజన్**

**అభిమాని కోరికను గౌరవించి ఇంటికి వెళ్లి పరామర్శించిన ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు**

**ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. తల్లిదండ్రులకు భరోసా.. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం**

**నిరంజన్ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేత- వరంగల్ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు**

ప్రొద్దుటూరు జూన్ 17 మనం న్యూస్:
ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన డి.ఎన్.డి అనే జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ ఎదుగుదల లేని స్థితిలో, మంచానికే పరిమితం అయిన యువ అభిమాని కోరికను మన్నించి స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆర్థిక భరోసాతోపాటు భగవంతుని తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ కి చెందిన 17 ఏళ్ల నిరంజన్ అరుదైన వ్యాధితో పోరాడుతున్నాడు. తన చివరి కోరికగా శ్రీ పవన్ కళ్యాణ్ ని కలవాలని అభిలషించారు. తెలంగాణ జనసేన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రివర్యులు





బుధవారం స్వయంగా నిరంజన్ ఇంటికి వెళ్లారు. అతన్ని దగ్గరకు తీసుకుని పరామర్శించారు. తల్లిదండ్రులు శ్రీ పొనుగోటి రాంగోపాల్, శ్రీమతి మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు? అతన్ని కాపాడుకోవడానికి ఏం చేయొచ్చు అన్న విషయాలపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఉంటాయని చెప్పి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం నింపారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. నిరంజన్ ఆరోగ్యం కోసం వరంగల్ విఖ్యాత భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేయిస్తానని తెలిపారు.

**చలించిపోయిన పవన్ కళ్యాణ్**

నిరంజన్ ను చూసేందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ ఆతనితో చాలా సమయం గడిపారు. ఇంట్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ లేవలేని స్థితిలో ఉన్న అభిమానిని చూసి చలించిపోయారు. అతని మంచంపై కూర్చుని ఆత్మీయంగా హత్తుకున్నారు. నుదిటిపై ముద్దు పెట్టి ఆప్యాయంగా పలకరించారు. 'చిన్ననాటి నుంచి మీరంటే అభిమానం' అని నిరంజన్ చెప్పిన మాటలు విని కదలిపోయారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని అతనికి కప్పి, కళ్యాణం అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. భద్రకాళి అమ్మవారి వెండి ప్రతిమకు ఆలయంలో పూజ చేయించి కుటుంబ సభ్యులకు అందజేస్తానని తెలిపారు.
నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో శ్రీ పవన్ కళ్యాణ్ గారిని అనుకరిస్తూ చేసిన డాన్సుల తాలూకు వీడియోలు, ఫొటోలను తిలకించారు. అంతా తనని చోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని నిరంజన్ చెప్పాడు.

**కుటుంబ జీవనోపాధికి క్యాంటీన్**

ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపి పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్ ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్లో పని చేసేవా రమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నాయకులకి దిశానిర్దేశం చేశారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ కళ్యాణ్ నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. శ్రీ పవన్ కళ్యాణ్‌తోపాటు జనసేన పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ శంకర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ తాళ్లూరి, పార్టీ నాయకులు రాధారం రాజలింగం, శ్రీ ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

## ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించిన అర్బన్ సీఐ సి. చంద్రశేఖర్

రైల్వే కోడూరు, జూన్ 17, మనం న్యూస్
తిరుపతి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో రైల్వే కోడూరు పట్టణ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ చంద్ర శేఖర్ మరియు వారి సిబ్బంది బుధవారం మామిడి కాయల మండి దగ్గర ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ముఖ్యంగా ట్రాక్టర్లలో అధిక లోడ్లు తీసుకెళ్లరాదని, వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని, రాత్రి సమయంలో లైట్లు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం ప్రమాదాలకు దారితీస్తుందని తెలియజేశారు. వ్యవసాయ పనులు మరియు ఇతర అవసరాల కోసం ట్రాక్టర్లను



ఉపయోగించే సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రాణ నష్టం మరియు ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని వివరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాక్టర్ డ్రైవర్లు జాగ్రత్తగా వ్యవహరించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అలాగే కోడూరు పట్టణ సిఐ చంద్రశేఖర్ మరియు వారి సిబ్బంది ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు కూడా అతికించడం జరిగింది.

## కోడిపందాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు : ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి

రైల్వే కోడూరు, జూన్ 17, మనం న్యూస్
తిరుపతి జిల్లా రైల్వేకోడూరు మండల పరిధిలో సెట్టిగుంట గ్రామ సమీపం లో ఈశ్వరయ్య మామిడి తోట వద్ద కోడి పందేలు నిర్వహిస్తూ నగదు పందాలు కాస్తున్న 23 మంది నిందితుల పై రైల్వే కోడూరు అర్బన్ ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి వారి వద్ద నుండి నగదు, కోళ్లు, కత్తులు, సెల్ ఫోన్ మరియు మోటార్ సైకిళ్లను స్వాధీన పరుచుకొని రైల్వే కోడూరు పోలీస్ స్టేషన్ క్రైమ్ నం. 143/2026, సెక్షన్ ఏపీ గేమింగ్ యాక్ట్ సెక్షన్ 9(2) కింద కేసు నమోదు చేసి బుధవారం నిందితులను కోర్టు ముందర హాజరు పరచడం జరిగిందని, నిందితులకు న్యాయ స్థానం దోషులుగా నిర్ధారించి వారికి జరిమానా కింద శిక్ష విధించడం జరిగిందని ఎస్సై లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మీడియాకు తెలియజేశారు. ఎవరైనా కోడి పందేలు మరియు జూదం, అసాంఘిక కార్యకలాపాలు పాల్పడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్ప డిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.